క్లుప్తంగా

చిప్పగిరి ఎస్‌ఐగా రమేష్‌బాబు



చిప్పగిరి: ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా చిప్పగిరి మండల ఎస్‌ఐగా రమేష్‌బాబు నియమితులయ్యారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న మల్లికార్జున నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు వెళ్లగా వీఆర్‌లో ఉన్న రమేష్ బాబు బదిలీపై చిప్పగిరికి వచ్చారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

భూసర్వేతో సమస్యల పరిష్కారం



సర్వే చేస్తున్న అధికారులు

మద్దికెర: ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు సమగ్ర సర్వేతో పరిష్కారం లభిస్తుందని డీటీ ధనుంజయ అన్నారు. బసినేపల్లి గ్రామంలో భూసర్వే పనులు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. పొలాల కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేశారు. రైతుల పొలాలను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రెవెన్యూ అధికారులు మల్లికార్జున, కృష్ణనాయక్, రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ఆస్పరి: వ్యవసాయ శాఖ సబ్సిడీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆస్పరి ఆర్‌బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున ఖరీఫ్ సాగుసీజన్‌లో పంటలను ఎప్పటికప్పుడు ఈక్రాప్ బుకింగ్ చేసి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఆర్‌బీకేలలో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీకే లభిస్తున్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ నరేంద్రకుమార్, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సభ్యులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో రైతులు, సలహామండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై టీఎంఆర్ దాణా 200 కిలోలు రూ.1300కు, జొన్న, మొక్కజొన్న, బ్లేడ్‌చాపర్స్ 2 హెచ్‌పీ బ్లేడ్ 40 శాతం సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు. రైతులు వేపనూనె సబ్సిడీతో అందజేయాలని కోరగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రకృతి వ్యవసాయం, జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఏఈఓ భోజరాజు, వీఏఏ ఆనంద్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

తుగ్గలి: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్మాణాలపై సమీక్షించారు. లబ్ధిదారుల నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలపై అందించే బిల్లులు, సామగ్రి, పొదుపు సంఘాల ద్వారా రుణం తదితర ప్రభుత్వ సాయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. అయినా లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపకపోతే వారి పట్టాలు రద్దు చేసేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈ విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించండి



మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ భీమప్పచౌదరి

హొళగుంద్/హాలహర్వి: మండల వ్యవసాయ శాఖ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బోర్డు చైర్మన్ భీమప్పచౌదరి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి చింతకుంట సహకార వ్యవసాయ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ బసప్ప, బోర్డు సభ్యులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించాలని చైర్మన్ సూచించారు. ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, కొర్రలు సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులను ప్రతి ఆర్‌బీకేలో నిల్వ ఉంచాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 146 మంది రైతులకు కౌలు గుర్తింపు కార్డులను అందజేసినట్లు తెలిపారు. ఏఓ శివశంకర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి 'జగనన్న సురక్ష'



నాగలదిన్నెలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నూర్జహాన్



చిప్పగిరిలో ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు, అధికారులు

నందవరం: అర్హులై ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారికి కూడా లబ్ధి చేకుర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించిందని డీఎల్‌పీఓ నూర్జహాన్ అన్నారు. శుక్రవారం నాగలదిన్నె గ్రామంలో సర్పంచ్ బోయ లక్ష్మి ఆధ్వర్యంలో మండల అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం-1లో 924, సచివాలయం-2లో 1,204 సర్టిఫికెట్లు దరఖాస్తుదారులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందిస్తోందన్నారు. అలాగే గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపి బాగా చదివించాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. డ్రాపౌట్ చిల్డ్రన్స్ నందవరం మండలంలో 550 మంది ఉన్నారని, వారిని బడిలో చేర్పించాలని ఎంపీడీఓ దశరథ రామయ్య ఆదేశించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఆర్‌ఐ జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామంలో డీటీ ఏ.ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి పలువురు దరఖాస్తుదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించారు.

చిప్పగిరి: జగనన్న సురక్ష ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం సులభతరం అవుతుందని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గుమ్మనూరు గ్రామంలో జగనన్న సురక్ష ద్వారా దరకాస్తు చేసుకున్న 352 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏవైనా ధ్రువపత్రాలు లేని కారణంతో సంక్షేమ పథకాలకు దూరమై ఉంటే అలాంటి వారు వలంటీర్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కొండయ్య, డీటీ గుండాల నాయక్, సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన జగనన్న పాలన

ఎమ్మిగనూరుటౌన్: సంక్షేమ పథకాలతో ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో ఆ వార్డు కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమపథకాల బుక్‌లెట్లు ఇచ్చి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు 22వ వార్డులో మహిళకు బుక్‌లెట్ ఇచ్చి మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్. కుర్లారు గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ శాంతమ్మ, నాయకులు పద్మమ్మ, హనుమంతు, మాధవస్వామి, వెంకటేష్, బడేసాబ్, సత్యన్న, దస్తగిరి పాల్గొన్నారు.

విత్తన విక్రయాల నిలిపివేత

నందవరం: అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తనిఖీ బృందం అధికారి ఏడీఏ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని ఇబ్రహీంపురం, నాగలదిన్నె గ్రామాల్లో ఎరువులు, విత్తన దుకాణాల్లో ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు ఏడీఏ వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి, నందవరం ఏఓ మధ్రి స్రవంతి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లో తగిన అనుమతులు లేని రూ.3.67 లక్షలు విలువచేసే 10 క్వింటాళ్ల విత్తన విక్రయాలను నిలుపుదల చేశారు. నాగలదిన్నెలో విత్తన దుకాణాల్లో రికార్డులు సక్రమంగా లేవని తేలింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. శివకిరణ్ దుకాణంలో అనుమతి లేవని విత్తన అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. దుకాణదారులు నిబంధనలు పాటించాలని ఏఓ మధ్రి స్రవంతి హెచ్చరించారు. రైతులకు విత్తనాలు విక్రయిస్తే బిల్లు బుక్‌లో సంతకాలు తీసుకుని, రసీదులు ఇవ్వాలని సూచించారు.



ఇబ్రహీంపురంలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారులు, ఏఓ

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

మద్దికెర: మండల కేంద్రంలో సీనియర్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెలుగుప్ప ప్రసాద్‌రెడ్డి (50) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. గత కొంతకాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తండాల్లో తీరనున్న విద్యుత్ సమస్య

తుగ్గలి: మండలంలో గిరిజన తండాల్లో గత కొన్నేళ్లుగా నెలకొన్న విద్యుత్తు సమస్యలు ఎట్టకేలకు పరిష్కారం కానున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తండాల్లో పక్కా గృహాలు నిర్మితమవుతున్నాయి. దీంతో విద్యుత్ స్తంభాలు, లైన్ల కొరత ఉండేది. గతేడాది తండాల్లో ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కుంభా రవి పర్యటించిన సమయంలో సుగాలీలు విద్యుత్తు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం కోసం ఆయన జిల్లా కలెక్టర్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈలను ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు తండాల్లో విద్యుత్తు స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు బంజార హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగాలి వెంకటనాయక్, సభ్యులు బాబునాయక్, జగదీష్‌నాయక్ ఎస్టీ కమిషన్‌కు, జిల్లా కలెక్టర్, విద్యుత్తు శాఖ అధికారులకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు.

డెంగ్యూ నివారణపై అవగాహన

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రై డే సందర్భంగా డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమ పుట్టరాదు-దోమ కుట్టరాదు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం తేరుబజారులో మానవహారం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అరుణ్‌కుమార్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రూ.32 వేల రికవరీకి ఆదేశం



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథరెడ్డి

కృష్ణగిరి: కృష్ణగిరి మండలంలో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా వివిధ శాఖల్లో చేపట్టిన పనులకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో రూ.32 వేల రికవరీకి ఆదేశించినట్లు జిల్లా డ్వామా పీడీ అమర్నాథరెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులతోపాటు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా చేపట్టిన రూ.9 కోట్ల పనులపై గత 11 రోజులుగా తనిఖీ చేపట్టడం జరిగిందన్నారు. పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. రికవరీకి ఆదేశించిన వాటిలో రూ.26 వేలను వెంటనే రికవరీ చేసినట్లు తెలిపారు. వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సలీంబాషా, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, ఎంపీడీఓ విశ్వ మోహన్, ఏపీడీ లక్ష్మన్న, ఏపీఓలు అబ్దుల్‌షకూర్, శ్రీనివాసులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్‌లతో భూగర్భ జలాల పెరుగుదల

కృష్ణగిరి: భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోతుగల్లు పంచాయతీ పరిధిలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. నీటి నిల్వలను పెంచే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అలాగే సబ్సిడీ కింద రైతులకు ఉపయోగపడే పైపులను అందజేశామన్నారు. చెరువులో అమృత్ సరోవర్ కింద పనులు జరుగుతున్నాయని పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వాటర్‌షెడ్ ఏపీడీ సలీంబాషా, కమిటీ సభ్యులు వెంకటేష్, సుధాకర్ ఉన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం

ఆస్పరి: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటం చేస్తామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఆస్పరిలో జిల్లా కన్వీనర్ పులికొండ అధ్యక్షతన ఎంఆర్‌పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా పరుశురాం, కన్వీనర్‌గా తొగలుగల్లు సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా రంగస్వామితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు శ్రీరాములు, చిన్న అంజి, నెట్టేకల్లు, శేఖర్, ఉల్లెప్ప పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

వెల్దుర్తి: రైలు నుంచి జారి పడి వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన తోటశ్రీ మణికంఠ రాయల్(21) అనే యువకుడు మృతి చెందాడు. తమిళనాడు రైల్వే పోలీసులు వెల్దుర్తి పోలీసులకు అందించిన సమాచారం మేరకు.. ఈనెల 13న వేలూరు జిల్లా జోలార్‌పేట్ (సోలార్‌పేట్) పరిధిలో రైల్వే పట్టాలపై యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ద్వారా వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామవాసి అని తెలుసుకుని వెల్దుర్తి పోలీసులకు సమాచారం అందించారు. మణికంఠ రాయల్ తండ్రి సతీష్‌బాబు నంద్యాలలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం మృతిచెందాడు. తల్లి జానకి అనంతపురం జిల్లాలోని గుంతకల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి వద్దే ఉంటున్న మణికంఠ రాయల్..డిఫెన్స్ పరీక్షలు రాసేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న తల్లి జానకి ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి, అనంతరం అక్కడే ఎలక్ట్రికల్ బరియల్ గ్రౌండ్‌లో దహనక్రియలు పూర్తి చేశారు.



మృతదేహం వద్ద లభించిన ఆధారాలు

నేడు విద్యాశాఖ సెక్రటరీ రాక

ఆలూరు: నియోజకవర్గంలోని హాలహర్వి, హొళగుంద, ఆలూరు మండలాల్లో జెడ్పీ హైస్కూళ్లను తనిఖీ చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ శుక్రవారం వస్తున్నట్లు ఎంఈఓలు కోమలాదేవి, ఈరన్న తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఆయా మండలాల్లోని ఎంపీపీ, యూపీ, జెడ్పీ, కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలలు, గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల, కళాశాలల హెచ్‌ఎంలు అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

విత్తన దుకాణం తనిఖీ

వెల్దుర్తి: పట్టణంలోని ప్రైవేట్ విత్తన, ఎరువుల దుకాణాన్ని శుక్రవారం ఏఓ అక్బర్‌బాష తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కొనుగోలు చేస్తున్న రైతులతో ధరల గురించి వాకబు చేశారు. ఎమ్మార్పీకి మించి కొనుగోలు చేయవద్దని, బిల్లులు అడిగి తీసుకోవాలని రైతులకు సూచించారు. అనుమతి లేని విత్తనాలేవీ దుకాణాలలో ఉండరాదని, ఉన్నా, అమ్మకాలు సాగించినా చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి



మృతి చెందిన రైతు గోరంట్ల

వెల్దుర్తి: పైరుకు పిచికారీ చేసి పురుగు మందు ప్రభావంతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెర్లకొత్తూరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రైతు గోరంట్ల(53) గురువారం తన భార్య, పెద్ద కుమారుడు చంద్రశేఖర్‌తో కలిసి గ్రామ సమీపంలోని తన కౌలు పొలానికి వెళ్లాడు. పత్తి పైరుకు పురుగుల మందు పిచికారీ చేశాడు. సాయంత్రం ఇంటికి చేరుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రైతు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శుక్రవారం రైతు భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాణ్యతతో పనులు చేపట్టండి

పత్తికొండ రూరల్: పత్తికొండ పట్టణం ఆదోని రోడ్డులోని యశోదా టవర్స్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ నారాయణదాస్, మండల ఏఈ వెంకటేశ్వర్లు పనులను పరిశీలించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభమైనట్లు ఎంపీపీ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆస్పరి: మండలంలోని వలగొండ గ్రామంలో పొలం గట్టు విషయంలో చిన్న అంజినయ్య అనే వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. వలగొండ గ్రామంలో చిన్న అంజినయ్య, లక్ష్మన్ రావుకు చెందిన పొలాలు పక్క పక్కనే ఉన్నాయి. పొలం గట్టు విషయంలో వాగ్వాదం చోటు చేసుకుని చిన్న అంజినయ్యపై లక్ష్మన్‌రావుతో పాటు మరో నలుగురు దాడి చేయడంతో చిన్న అంజినయ్యకు గాయాలయ్యాయి. బాధితుడు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడిన ఐదుగురిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

వలంటీర్ కృషితోనే పింఛన్



దివ్యాంగ చిన్నారి అప్సానాకు పింఛన్ అందిచేందుకు బయోమెట్రిక్ నమోదు చేస్తున్న వలంటీర్ విజయ్

ఈ చిత్రంలో మానసిక దివ్యాంగురాలైన కూతురు అప్సానాను ఒళ్లో కూర్చోబెట్టుకున్న మహిళ పేరు ముంతాజ్ బేగం. భర్త చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు సంతానం. చివరి సంతామనమైన అప్సానా పుట్టుకతో మానసిక దివ్యాంగురాలు. వీరు ఆలూరు కోయనగర్ కాలనీలో అద్దె భవనంలో నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో చిన్నారికి పింఛన్ రాలేదు. వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ వారికి అండగా నిలిచింది. వలంటీర్ విజయ్ వారి ఇంటికి వెళ్లి పాప వివరాలు తీసుకుని పింఛన్ కోసం దరఖాస్తు చేయించాడు. నెలలోపే ఆ చిన్నారికి రూ.3 వేల పింఛన్ వర్తించింది. వలంటీర్ కృషి వల్లే దివ్యాంగ చిన్నారికి పింఛన్ వచ్చింది. ఇలాంటి వలంటీర్ వ్యవస్థను అందుబాటులో తెచ్చిన సీఎంకు, వలంటీర్‌కు రుణపడి ఉంటామని ఆ తల్లిదండ్రులు చెబుతున్నారు.

సాయం మరువలేనిది



నా భర్త చికెన్ షాపులో పనిచేస్తే రోజుకు రూ.300 వస్తాయి. నేను గృహిణి. మా మూడో కుతూరు మానసిక వికలాంగురాలు. 2018 నుంచి పింఛన్ కోసం అప్‌లైన్ చేస్తూ వచ్చాం. పాపకు మందుల ఖర్చులకు డబ్బులు కావాలి. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో 2021 సెప్టెంబర్‌లో వలంటీర్ మా ఇంటికి వచ్చి మా పాప సదరం సర్టిఫికెట్ ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులు తీసుకుని వెళ్లాడు. నెల తర్వాత అతనే మా ఇంటికి వచ్చి మీ పాపకు రూ.3 వేలు పింఛన్ వచ్చిందని ఇచ్చిపోయాడు. ప్రతి నెలా వచ్చే పింఛన్ సొమ్ముతోనే అప్సానాకు మందులు కొంటున్నాం. వలంటీర్ సాయాన్ని ఎప్పటికీ మరువం. **– ముంతాజ్ బేగం, ఆలూరు**

భారంగా భావించలేదు



పెరాలసిస్ బాధితుడు రామకృష్ణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ షేక్ అలీ (ఫైల్)

వెల్దుర్తికి చెందిన వలంటీర్ షేక్ అలీ విధులు చేపట్టిన సమయంలో తన పరిధిలోని 14వ వార్డుకు చెందిన బోడిగండ్ల రామకృష్ణకు దివ్యాంగ పింఛన్ అందించాల్సి వచ్చింది. ఆ ఇంటికి వెళ్లి చూస్తే ఎవరూ లేరు. వాకబు చేస్తే రామకృష్ణ 11 ఏళ్ల క్రితం పట్టణంలో మోటార్ మెకానిక్‌గా చేస్తుండగా పెరాలసిస్‌తో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. దీంతో రామకృష్ణ, భార్య విజయగౌరితో కలిసి కర్నూలు అశోక్‌నగర్‌లో కూతురు ఇంట్లో ఉంటూ ఫిజియోథెరపీ, హోమియోపతి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఆ కుటుంబానికి పింఛన్ సొమ్ము ఎంత అవసరమో తెలుసుకున్న షేక్ అలీ కరోనా సమయంలో నిబంధనలు పాటిస్తూ కర్నూలుకు వెళ్లి పింఛన్ అందించాడు. నాటి నుంచి భారంగా భావించకుండా అడపాదడపా కర్నూలుకే వెళ్లి పింఛన్ అందిస్తున్నాడు. దీంతోపాటు వైఎస్సార్ చేయూత, ఇంటిపట్టాను మంజూరు చేయించి మానవత్వం చాటుకున్నాడు. రామకృష్ణ ఎక్కువగా కర్నూలులో ఉంటూ చికిత్స పొందుతుండడంతో అతని పింఛన్‌ను ఇటీవల అశోక్‌నగర్ సచివాలయానికి మ్యాపింగ్ చేయించి ప్రతినెలా 1వ తేదీన అక్కడే పింఛన్ అందించే ఏర్పాటు చేశాడు. తన పరిధిలోని కుటుంబాలకు చేదోడుగా ఉంటూ ప్రశంసలు అందుకుంటున్నాడు.

మా కుటుంబానికి అండగా ఉన్నారు

పెరాలసిస్ బాధితుడినైన నేను గతంలో ఆపసోపాలు పడుతూ భార్య సహాయంతో ఆటోలో వెళ్లి వెల్దుర్తి పంచాయతీ ఆఫీసు వద్ద పడిగాపులు గాసి పింఛన్ తీసుకునేవాడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థతో ఆ ఇబ్బందులు తప్పాయి. మా వలంటీర్ షేక్ అలీ సేవలతో మాకు ఆత్మ బలం చేకూరింది. తానే ఫోన్ చేసి మా బాగోగులు అడగడమే గాకుండా ఇంకా ఏమేమి పథకాలు అందుతాయో తెలుపుతూ ఉంటాడు. చికిత్స కోసం నేను కర్నూలుకు వస్తే కరోనా సమయంలోనూ మొక్కవోని ధైర్యంతో మా ఇంటికి వచ్చి పింఛన్ అందించాడు. మాకు జగనన్న లేఅవుట్‌లో ప్లాటు, గృహం మంజూరు, నా భార్యకు వైఎస్సార్ చేయూత అతడు మంజూరు చేయించినవే. వలంటీర్ ఉన్నాడన్న ధైర్యం మాకు కొండంత బలాన్నిస్తోంది. **– రామకృష్ణ, వెల్దుర్తి**

అనుచిత వ్యాఖ్యలపై నిరసన



హాలహర్విలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

హాలహర్వి: సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత, ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం హాలహర్వి ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండు వరకు వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీ చేపట్టి నిరసన తెలియజేశారు. అనంతరం పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, వైస్ ఎంపీపీ నాగేష్, వలంటీర్లు మాట్లాడుతూ.. పవన్ ఒక రాజకీయ పార్టీ అధినేత అయి ఉండి వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. చంద్రబాబుకు తొత్తుగా పనిచేస్తూ దురాలోచనతో విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం వలంటీర్లు, నాయకులు కలిసి పవన్‌కళ్యాణ్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు.

శాకాంబరీ నమోస్తుతే



శాకాంబరీ అలంకారంలో గాయత్రీ మాత



మద్దికెరలో అమ్మవారు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. శుక్రవారం ఆలయంలో అమ్మవారిని కాయగూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మద్దికెర: స్థానిక నగిరేశ్వరి దేవాలయంలో వాసవీ మాత శుక్రవారం శాకాంబరీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిని రకరకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులకు ప్రసాదం వినిమయం చేశారు.

సంక్షిప్తం

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

తుగ్గలి: ఇంటి నిర్మాణ పనులు చేస్తూ సెంట్రీ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్యాపిలి మండలం పెద్దపూదెళ్లకు చెందిన తిరుమలయ్య శుక్రవారం రాంపల్లిలో ఓ ఇంటిపై సెంట్రింగ్ పనులు చేస్తుండగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు తీగలు ఇనుప కడ్డీలకు తగిలాయి. దీంతో తిరుమలయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. కాళ్లు, చేతులు, వీపున తీవ్రగాయాలు కావడంతో బాధితుడిని చికిత్స నిమిత్తం డోన్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

అసత్య ఆరోపణలు సహించం

పత్తికొండ రూరల్: స్థలాలను కబ్జా చేస్తున్నారని అసత్య కథనాలతో ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనారిటీ నాయకుడు సాబ్దిన్ నూర్‌బాషా అన్నారు. శుక్రవారం మహమ్మదీయ మసీద్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. తన పేరిట రిజిస్ట్రేషన్ అయిన స్థలాన్ని మనోహర్ అనే వ్యక్తికి అమ్మేందుకు అడ్వాన్సు తీసుకున్నామన్నారు. మనోహర్‌ను తప్పించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని సుంకన్న కుట్రలు పన్నుతున్నారన్నారు. స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించాడని అడ్డుకునేందుకు వెళ్లిన తనతో పాటు తమ్ముడు మహబుబ్‌బాషాపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారన్నారు. రక్తగాయాలతో మహబుబ్‌బాష ఆసుపత్రిలో చికిత్స పొందాడన్నారు. వ్యక్తిగతమైన స్థల వివాదాన్ని వక్రీకరించడం తగదని పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

దేవనకొండ: గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సురేష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ డీఏపీ, యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు తీసుకోవాలని సూచించారు. ప్రయివేట్ ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులను కొని మోసపోరాదని, బిల్లులు పొందాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనారిటీలకు గుర్తింపు

మద్దికెర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు తగిన గుర్తింపునిచ్చి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఖాజావలి, ఉపాధ్యక్షుడు ఖలీల్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ..మైనార్టీలకు శాసమండలి చైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్లుగా పదవులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీలకు డీబీడీ రూపంలో రూ.10,771 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారని వివరించారు. మైనార్టీ నాయకులు హుమాయున్, మాజీ కోఆప్షన్ హుస్సేన్, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల గడువు పెంచండి

ఎమ్మిగనూరుటౌన్: ఇంటర్మీడియెట్ మూడవ దశ అడ్మిషన్ల గడువు ఈ నెలాఖరు వరకు పెంచాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ఒకేషనల్ అడ్మిషన్ల గడువు రేపటితో గడువు ముగుస్తుందని దీన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు.

వర్షం కోసం పూజలు

ఆలూరు: వరుణదేవుడు కరుణించాలని కురువెళ్లి గ్రామంలో బాటమారెమ్మవ్వ ఆలయ అర్చకుడు కుభేరాచారి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామదేవతకు బోనాలను సమర్పించారు. అదే విధంగా బిలేహాళ్ రాములమ్మవ్వ, మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఊరిమిండి రంగన్న, రమేష్, శేఖన్న, పెద్దవన్నూర్,అంగయ్య, తదితరులు భక్తులకు అన్నదానం చేశారు.